గుంతలమయంగా ప్రధాన రహదారి

- మద్దిరాల – ముకుందాపురం రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు


గుంతలమయంగా మారిన మద్దిరాల - ముకుందాపురం ప్రధాన రహదారి

మద్దిరాల : మండల కేంద్రం నుంచి ముకుందాపురం వెళ్లే ప్రధాన రహదారి (బీటీరోడ్డు)గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.బ బస్సులు, ఆటోలతో పాటు భారీ వాహనాలు తరుచుగా వెళ్తుండటం వల్ల రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల వల్ల ఇప్పటికే చాలా ప్రమాదాలు చోటు చేసుకున్నాయని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. ముకుందాపురం, జి.కొత్తపల్లి, మామిండ్ల మడవ, తూర్పుతండా, చిన్ననెమిల, చందుపట్ల గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి తరుచుగా వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. కానీ గుంతలమయంగా మారిన రోడ్డుపై వెళ్లలేక నానా అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి మరిపెడబంగ్లా, ఖమ్మం వెళ్లడానికి షార్ట్‌కట్ కావడంతో ఈ రోడ్‌లోనే ఎక్కువ మంది ప్రయాణికులు వెళ్తుంటారు. ఈ రోడ్డుపై గుంతలు, ప్రమాదకర మూలమలుపులు ఉండడంతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నూతన రోడ్డు కోసం నిధులు కేటాయించారు. కానీ ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో ఈ నిధులను నిలిపివేయడం జరిగింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈరోడ్డుపై గుంతలను పూడ్చాలని, లేదంటే నూతన రోడ్డును ఏర్పాటు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

అడుగడుగునా గుంతలే..



మద్దిరాల–ముకుదాపురం ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గుంతల కారణంగా చాలా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు వెంటనే స్పందించి నూతన రోడ్డు మంజూరు చేసి ప్రయాణికులకు, వాహనదారులకు సమస్యలను తొలగించాలి.

– గుగులోతు వీరునాయక్, గుట్టకాడి తండా

డబుల్ రోడ్డు వేయాలి



మద్దిరాల మండలం కాకముందునుంచే వాహనాలు ఈరోడ్డుగుండా తరుచుగా వెళ్తుండేవి. కానీ ఇప్పుడు మద్దిరాల నూతన మండలం కావడంతో వాహనాల రద్దీ ఇంకా ఎక్కువగా పెరిగింది. కానీ ఈరోడ్డు చాలా ఏళ్ల క్రితం ఏర్పాటు చేసింది కావడంతో ప్రస్తుతం గుంతలమయంగా మారింది. రోడ్డును విస్తరించి, డబుల్‌రోడ్డు వేయాలి.

– సాహెబ్‌భూషణ్, చిన్ననెమిల

హెడ్ పోస్టాఫీస్‌లో విలీనం చేయొద్దు


సూర్యాపేటలో సబ్ పోస్టాఫీస్ ఎదుట నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

సూర్యాపేట : పట్టణంలోని 25వ వార్డులో కొనసాగుతున్న సబ్ పోస్టాఫీస్‌ను హెడ్ పోస్టాఫీస్‌లో విలీనం చేయొద్దని బీఆర్‌ఎస్ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆకుల లవకుశ డిమాండ్ చేశారు. పెన్షన్‌దారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని విలీనం ఆలోచనను వెంటనే విరమించుకోవాలని అన్నారు. ఈ మేరకు మంగళవారం బ్యాంక్ స్ట్రీట్ సబ్ పోస్టాఫీస్ ఎదుట పెన్షన్‌దారులతో కలిసి ధర్నా నిర్వహించి మాట్లాడారు. ఈ పోస్టాఫీస్ కింద 3వేల మంది పెన్షన్‌దారులతో పాటు 3వేల మంది ఖాతాదారులు ఉన్నారని తెలిపారు. హెడ్ పోస్టాఫీస్‌లో విలీనం చేస్తే వృద్ధులు, వికలాంగులు పెన్షన్లు తీసుకునేందుకు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు అర్వపల్లి లింగయ్య, బైరు వెంకన్న ముదిరాజ్, పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

31న కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా


మాట్లాడుతున్న నాయకులు

సూర్యాపేట అర్బన్ : కార్మికుల హక్కుల సాధనకు నెల 31న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు గొడ్డలి నర్సయ్య పిలుపునిచ్చారు. కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాకు సంబంధించిన కరపత్రాలతో మంగళవారం పట్టణంలోని కార్మికుల అడ్డా వద్ద ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రం, దేశంలో కార్మికులు పని ప్రదేశంలో అనేక రకమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రభుత్వాల కుట్రలను కార్మికులంతా సంఘటితమై తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు గులాం హుస్సేన్, డివిజన్ నాయకులు ఉత్తరాది మోహన్, రాములు, నగేష్, సైదులు, కృష్ణ, అంజయ్య, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పరిసరాల్లో పరిశుభ్రతే లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి

- మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని ఇళ్ల పరిసరాల్లో పరిశుభ్రతే లక్ష్యం అని మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక 1వ వార్డులో 100 రోజుల పట్టణ ప్రణాళికలో భాగంగా నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పట్టణాలను మెరుగ్గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందని, ప్రజలు కూడా సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వేములకొండ పద్మ, మున్సిపల్ డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఈ తిరుమలయ్య, ఆర్‌పిలు గౌసుద్దీన్, అజీముద్దీన్, వార్డు అధికారి నరేష్, టీఎంసీ శ్వేత, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, సిబ్బంది, హెల్త్‌వర్కర్లు, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

ఈత వనాలతో ఉపాధి


అనంతారంలో ఈత మొక్కలు నాటుతున్న జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మణ్‌నాయక్

పెన్‌పహాడ్ : ఈత వనాల పెంపకంతో గీత కార్మికులకు ఉపాధి కలుగుతుందని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మంగళవారం అనంతారం గ్రామంలోని గౌడ సొసైటీ భూమిలో వన మహోత్సవంలో భాగంగా ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గీత కార్మికుల జీవనోపాధిని పెంపొందించడం కోసం ప్రభుత్వం సొసైటీలకు భూమిని కేటాయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ మల్లయ్య, ఎంపీడీఓ జానయ్య, ఏపీఓ రవి, పంచాయతీ కార్యదర్శి సోమయ్య, టీఏ రామ్‌కుమార్, గౌడ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఓంకార్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేద్దాం


మాట్లాడుతున్న నాయకులు

సూర్యాపేట : ఓంకార్ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వరికుప్పల వెంకన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లో ఏపూరి సోమన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకుముందు కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్, పార్టీ సభ్యురాలు ఏపూరి పిచ్చమ్మలకు రెండు నిమిషాలు సంతాపం ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడారు. మద్దికాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవాల సందర్భంగా రైతుల సమస్యలు, భూ పోరాటాలపై ఓంకార్ పాత్ర అనే అంశంపై జిల్లా కేంద్రంలో ఆగస్టు 8న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షేక్ నజీర్, నక్క శ్రీనివాస్, నలుగురి రమేష్, వేముల పెద్ద నరసయ్య, శ్రీరామోజు ఉమేష్, సోమగాని వెంకన్న, నూకపంగు వైభవ్, గుంటక నాగరాజు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

అర్వపల్లి : బాలెంలలోని జాజిరెడ్డిగూడెం ఎస్సీ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలలో మిగిలి ఉన్న సీట్లకు ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అరుణ తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 2025 మార్చిలో టెన్త్ ఉత్తీర్ణులైన బాలికలు తగిన సర్టిఫికెట్లతో 31న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రావాలని సూచించారు. ఆ తర్వాత వచ్చిన వారి దరఖాస్తులను స్వీకరించమని పేర్కొన్నారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల/పాఠశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ సంధ్యారాణి మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. ఖాళీగా ఉన్న సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో విద్యార్థులకు మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు. ఈనెల 31న ఉదయం 9 గంటలకు నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు ధ్రువీకరణ పత్రాలు, 3 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, 3 సెట్ల జిరాక్స్‌లతో హాజరుకావాలని తెలిపారు. అదే రోజు సాయంత్రం అర్హుల జాబితా ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

మద్దిరాల : మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇంటర్ ఎంపీటీ, బైపీసీ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు బుధవారం, గురువారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కేజీబీవీ ఎస్ఓ తేజశ్రీ మంగళవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో స్పాట్ అడ్మిషన్లకు హాజరై, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం 91824 79713 సంప్రదించాలని సూచించారు.

చివ్వెంల : సూర్యాపేట పట్టణంలోని చివ్వెంల మండలం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ, ఎంపీసీలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ విద్యాసాగర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 2025లో పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఈ నెల 31న ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు స్పాట్ అడ్మిషన్లు అందజేయనున్నట్లు తెలిపారు. 2:00 గంటల తర్వాత మెరిట్‌ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఎస్ఎస్‌సీ ఆన్‌లైన్ మెమో, టీసీ, స్టడీ సర్టిఫికెట్లతోపాటు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్‌లతో హాజరుకావాలని తెలిపారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 79950 10665ను సంప్రదించాలని సూచించారు.

నాగారం : వర్ధమానుకోటలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థినులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రత్యేక అధికారిణి ఎండీ షిరీన్ మంగళవారం తెలిపారు. బైపీసీ, ఎంఎల్‌టీ గ్రూప్‌లలో ఖాళీగా ఉన్న సీట్లలో చేరేందుకు 10వ తరగతి పాసైన విద్యార్థినులు ఈ నెల 30న సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 2025–26కు గానూ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఎస్ఓ ఆసియా జబీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినులు తమ ధ్రువపత్రాలు తీసుకొని కేజీబీవీలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా నాగుల పంచమి పూజలు


సూర్యాపేట : పూజలు నిర్వహిస్తున్న భక్తులు


సూర్యాపేట : పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

సూర్యాపేట : పిల్లలమర్రి శ్రీ మహాదేవ నామేశ్వర స్వామి, ఎరకేశ్వర స్వామి ఆలయాలలో మంగళవారం నాగుల పంచమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నాగ ప్రతిమకు పంచామృతాలతో అభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో అర్చకులు మునగలేటి సంతోష్ శర్మ, సాయి శర్మ, భక్తులు పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయంలో..

పట్టణంలోని శ్రీసంతోషి మాత ఆలయంలో శ్రావణ శుద్ధ పంచమి (నాగ పంచమి) సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో మానసా దేవి, శ్రీ సంతాన నాగదేవత అమ్మవార్లకు పంచామృత అభిషేకం జరిపారు. ఆంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకం, ఆకు పూజ, వడమాల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రావణమాసం మంగళవారం పురస్కరించుకొని మంగళ గౌరీదేవి వ్రతం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు బట్టారం వంశీకృష్ణ శర్మ, దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశం గుప్తా, బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, కోశాధికారి పాలవరపు రామమూర్తి, ఉప కోశాధికారి కొత్త మల్లికార్జున్, సహాయ కార్యదర్శి ఉప్పల రమేష్, కమిటీ సభ్యులు కక్కిరెని పద్మ పాల్గొన్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని మూసీనది ఒడ్డున ఉన్న శివాలయంలో మంగళవారం భక్తులు నాగుల పంచమి వేడుకలు నిర్వహించారు. నాగదేవత విగ్రహానికి పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు కోడూరు వినయ్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో పీఎంశ్రీ వేడుకలు


అనంతారంలోని మోడల్ స్కూల్‌లో పీఎంశ్రీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

తిరుమలగిరి : అనంతారం మోడల్ స్కూల్‌లో మంగళవారం ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) నూతన జాతీయ విద్యా విధానం 5వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎంఈఓ ఈ.శాంతయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీఎంశ్రీ శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక పరిశోధన కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకం ప్రవేశ పెట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లోజు నరేష్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

పెన్‌పహాడ్ : విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హిందీ ఉపాధ్యాయుడు ఆనందభాస్కర్ మంగళవారం తన సొంత ఖర్చులతో పదో తరగతి విద్యార్థులకు హిందీ స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతేడాది అందించిన మెటీరియల్‌తో విద్యార్థులు హిందీలో 100శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్, రాములు, కృష్ణయ్య పాల్గొన్నారు.

నాగారం : దాతలు అందజేస్తున్న డైరీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం జానకి అన్నారు. మంగళవారం డి.కొత్తపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో సూర్యాపేటలోని శాస్త్ర ఉన్నత పాఠశాల రాయినిగూడెం యాజమాన్యం వారి ఆర్థిక సహకారంతో 75 మంది విద్యార్థులకు ఉచితంగా డైరీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, కిష్టయ్య, వీరయ్య, హేమమాలిని, జానకి రాములు, సుధాకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంఈఓ, దాత


నాగారం : డైరీలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త వహించాలి



అన్నారంలోని పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బైన రమ్య

తుంగతుర్తి : సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని డాక్టర్ బైన రమ్య అన్నారు. మంగళవారం అన్నారం జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్షాకాలం దృష్ట్యా ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కలుషిత నీరు, కలుషిత ఆహార పదార్థాలు తినడం వల్ల టైఫాయిడ్, నీళ్ల విరేచనాలు, బంక విరేచనాలు, కలరా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వేడిగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలని, కాచి చల్లార్చి వడబోసిన నీటిని తాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవికుమార్, హెల్త్ అసిస్టెంట్లు గాజుల సోమన్న, యాదగిరి, ఆశాలు చిత్తలూరి రమ, నేలమ్మ, మేరమ్మ, పద్మ, ప్రధానోపాధ్యాయురాలు సునీత, రాణి పాల్గొన్నారు.

నాగారం : సీజనల్ వ్యాధుల పట్ల ఆరోగ్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ యనగందుల నాగరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందితో జన్ ఆరోగ్య సమితి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్య సిబ్బంది విధిగా గ్రామాల్లో పర్యటించాలని.. గర్భిణులకు, బాలింతలకు, పాఠశాలల విద్యార్థులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరికిషోర్‌శర్మ, హెచ్ఈఓ బిచ్చు నాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ విమలమ్మ, సూపర్‌వైజర్ రామచంద్ర, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్వపల్లి : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి ప్రజలు వ్యాధులను దరిచేరనీయవద్దని మండల వైద్యాధికారి డాక్టర్ భూక్యా నగేష్‌నాయక్ కోరారు. స్థానిక కేజీబీవీలో మంగళవారం సీజనల్ వ్యాధులపై బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్షాకాలంలో వివిధ రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలునాయక్, సీహెచ్ఓ ఎం.బిచ్చునాయక్, సూపర్‌వైజర్ లలిత, ఎస్ఓ నాగరాణి, డాక్టర్ నిహారిక, జ్యోతి, గిరిజ, ఉపాధ్యాయులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వన మహోత్సవం


ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మొక్కలు నాటుతున్న వైద్యసిబ్బంది

ఆత్మకూర్(ఎస్) : వన మహోత్సవంలో భాగంగా మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి మౌనిక మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇంటిలో కనీసం ఐదు మొక్కలు నాటి పెంచాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పూల చెట్లతో పాటు నీడనిచ్చే చెట్లను, పండ్ల చెట్లను నాటారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వీరేంద్రనాథ్, శైలజ, సీహెచ్ఓ యాదగిరి, సూపర్వైజర్లు సైదులు, మాణిక్యమ్మ, కొండ్ల శ్రీను, రాజేంద్రప్రసాద్, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే సామేల్ రాక

నూతనకల్ : రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసేందుకు బుధవారం నూతనకల్ మండల కేంద్రంలోని సాయిరాం ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేస్తున్న సదస్సుకు ఎమ్మెల్యే సామేల్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీత మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని వారు కోరారు.

‘శిలాఫలకాల ధ్వంసంతో సంబంధం లేదు’

నూతనకల్ : మండల పరిధిలోని తాళ్లసింగారంలో గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన శిలాఫలకాలతో బీఆర్‌ఎస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని పార్టీ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేసిన మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులతోపాటు ఎమ్మెల్యే మందుల సామేల్ ఆవిష్కరించిన శిలాఫలకాలను ధ్వంసం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బత్తుల విద్యాసాగర్, రేసు వెంకటేశ్వర్లు, బత్తుల సాయిలుగౌడ్, బత్తుల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు లేకుండా చూడండి


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ

అర్వపల్లి : గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి సూచించారు. మంగళవారం జాజిరెడ్డిగూడెం మండలంలోని రామన్నగూడెంలో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామంలోని వన నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, రామ్మూర్తి, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

తుంగతుర్తి : కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 31న జరిగే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా కమిటీ సభ్యుడు దర్శనం రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని దుబ్బాక సంజీవరెడ్డి విజ్ఞాన కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మిట్టగడప నాగయ్య, నాగార్జున్, కలకోట్ల సందీప్, బత్తుల మల్లయ్య, పెరక దానయ్య, మణమ్మ, కలకుట్ల ఎల్లమ్మ, పానుగంటి అబ్బమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా గౌస్ పాషా



తుంగతుర్తి : తెలంగాణ రాష్ట్ర న్యాయమూర్తుల అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా తుంగతుర్తి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎండీ గౌస్ పాషా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన 2025 – 26 సంవత్సరం ఎన్నికల పోటీలలో పాల్గొని విజయం సాధించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నికైన జడ్జిని న్యాయవాదులు మంగళవారం శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు

సూర్యాపేటటౌన్ : ఉపాధ్యాయుల పదోన్నతులను పారదర్శకంగా చేపట్టాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ మోతీలాల్ నాయక్ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు ధరావత్ వస్త్రం నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బగ్గులాల్ నాయక్, లింగా నాయక్, రమేష్, బద్రు నాయక్ పాల్గొన్నారు.

వాగ్దానాలు అమలు చేయాలి


మాట్లాడుతున్న యాదగిరిరావు

అర్వపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో మంగళవారం తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. గోదావరి జలాలను వెంటనే విడుదల చేయలని, అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చెరుకు యాకలక్ష్మి, కోట గోపి, పులుసు సత్యం, మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, శిగ వెంకన్న, కొప్పోజు సరోజ, ఎల్లంల అవిలయ్య, ఉప్పలయ్య, సైదులు, మచ్చ నర్సయ్య, లక్ష్మి, రాజు, వెంకన్న, వజ్జె వినయ్, వీరయ్య, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ మాస వేడుకలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో శ్రావణ మాస వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చన కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, బైరబోయిన మహరాజు, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

30పడకల ఆస్పత్రిగా మార్చాలి

నూతనకల్ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30పడకల ఆస్పత్రిగా మార్చాలని కోరుతూ పీవైఎల్ ఆధ్వర్యంలో మంగళవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా కోశాధికారి బండి రవి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించి ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలను అందించాలని కోరారు. సీహెచ్ఓ శరణ్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్, పీవైఎల్ నాయకులు పులుసు మహేష్, పంతం శ్రీను, గడ్డం పాపయ్య, దాసరి శ్రీనివాస్, దేసోజు మధు, వెంకన్న, శృతి, హసన్ తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్స్ కమిటీ ఎన్నిక


నూతన కమిటీతో లారీ డ్రైవర్‌లు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని ఏపూరులో లారీ డ్రైవర్స్ యూనియన్ గ్రామ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లారీ డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడిగా రావుల ఉదయ్, ఉపాధ్యక్షుడిగా కప్ప సైదులు, ప్రధాన కార్యదర్శిగా బండి ఉపేందర్, కార్యదర్శిగా గాదగాని భిక్షం, కోశాధికారిగా గండమల్ల రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడారు. యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు అంతా ఐక్యంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో జలగం లింగయ్య, షరీఫ్, వెంకన్న పాల్గొన్నారు.